క్లుప్తంగా

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఆదిలాబాద్: ఈస్టర్ వేడుకలను జిల్లా కేంద్రంలో క్రైస్తవులు ఆదివారం నిర్వహించుకున్నారు. సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో క్రీస్తు పునరుత్థానంను క్యాండిల్స్ వెలిగించి, ఈ లోకానికి క్రీస్తు వెలుగై ఉన్నారని స్మరించుకున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు సందేశం అందించారు. కార్యక్రమాల్లో జీడీసీసీ చైర్మన్ రెవా.వి.శామ్యూల్, మహిళల మైత్రి సెక్రటరీ ఆర్.శిరోమణి శామ్యూల్, మైత్రి అధ్యక్షులు వి.విజయలక్ష్మి శామ్యూల్, సంఘ పాస్టరేట్ కమిటీ సభ్యులు, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో టీచర్స్ కాలనీలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు నేహమ్యా, పీటర్ నాయక్, మాణిక్యం, కరుణకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

'చంపినోళ్లే సంతాపసభ పెట్టినట్టుంది'

ఆదిలాబాద్‌టౌన్: చంపినోళ్లే సంతాపసభ పెట్టినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇంద్రవెల్లి ఘటన జరిగి 44 ఏళ్లవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ బిడ్డలు బలయ్యారని ఆరోపించారు. వారికి సంతాపం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళులర్పించడం జరిగిందన్నారు. చరిత్ర మార్చాలని చూసినా మారదన్నారు. సమావేశంలో కుమ్ర రాజు, దయానంద్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణంలోని ఖానాపూర్, అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జోగు రామన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను అల్లరిపాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని పక్కనబెట్టి మోసపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు అష్రఫ్, సాజిదొద్దిన్, ఇజ్జగిరి అశోక్, దేవిదాస్, విఠల్, మహేశ్, దయానంద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

నార్నూర్: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి సంబురాలు జరుపుతున్నామని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద, మాన్కాపూర్, భీంపూర్, పూసిగూడ గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించి పదేళ్ల తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో విజయవంతంగా పని చేసిందన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హ న్మంతరావు, మండల కార్యదర్శి సయ్యద్‌ఖాశీం, ఫా క్స్ చైర్మన్ అడే సురేశ్, ఉర్వేత రూప్‌దేవ్, తొడసం నాగోరావు, కనక ప్రభాకర్, మాడవి రూప్‌దేవ్, రాథోడ్ విష్ణు, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని సాథ్ నంబర్‌లో ఆదివారం ఉచిత గాలికుంటు నివారణ టీకాలను మండల పశువైద్యాధికారి గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో వేశారు. మండల వ్యాప్తంగా ప్రతీ పంచాయతీ కార్యాలయంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాలు ఆపితే చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: ఎవరైనా ప్రైవేట్ వ్యక్తులు వాహనాలు ఆపి వాటికి సంబంధించిన పత్రాలు అడిగితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర వైపు నుంచి గుడిహత్నూర్ వైపు పశువులతో లోడ్‌తో ఆదివారం ఓ వాహనం వెళ్తుంది. ఇది గమనించిన రోహిత్ షిండే భోరజ్ నుంచి మావల వరకు ఆ వాహనాన్ని వెంబడించారు. అంతేకాకుండా వాహనానికి సంబంధించిన పత్రాలు అడగారు. దీంతో వాహన డ్రైవర్ ఇచ్చినా ఫిర్యాదు మేరకు రోహిత్ షిండేపై కేసు నమోదు చేశాం. అలాగే వాహనంలో 12 పశువుల బదులు పరిమితికి మించి 16 పశువులు తరలించడంతో వాహన డ్రైవర్, యాజమాని, పశువుల యాజమానిపై సైతం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

తాటి ముంజలు.. భలే పసందు



భానుడు భగ్గుమంటున్నాడు. దీంతో జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వారు దాహార్తితో అల్లాడిపోతున్నారు. ఎన్ని నీళ్లు తాగిన దాహం తీరని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరానికి చలువచేసే తాటి ముంజల కొనుగోలుపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక డైట్ కళాశాల సమీపంలోని వివేకానందచౌక్‌లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రూ.120కి డజన్ తాటిముంజలు అమ్ముతున్నారు. – కైలాస్‌నగర్

పంట పశువుల పాలు..

మే నెలకు ముందుగానే చెరువులు, వాగులు అడుగంటాయి. దీంతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. సిరికొండ మండలంలోని చిక్‌మాన్ జలశయంను నమ్ముకుని మండల కేంద్రానికి చెందిన రైతు బియ్యాల మల్లేష్ ఐదు ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని జొన్న వేశాడు. జలశయంలో నీరు లేకపోవవడంతో పంటను పశువులకు మేపుతున్నాడు. – సిరికొండ



గ్రంథాలయం ప్రారంభం


మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపలగూడలో మన పల్లె స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయం ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ తరపున 20 కుర్చీలు, 2 టేబుళ్లు, రూ.25 వేల విలువ గల పుస్తకాలు అందించారు. అలాగే విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ రూ.20 వేల విలువగల పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బద్దం నర్సింగ్ రెడ్డి, విన్నర్స్ పబ్లికేషన్ సభ్యులు బద్దం పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్, కొప్పుల దేవిదాస్, ఆనంద్, కుంచెట్టి సంతోష్, అల్చేట్టి నాగన్న, అరిగెల కిష్టయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం భోరజ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో శ్రీ మహాశక్తి మైసమ్మ ఆలయంలో ప్రవేశ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైసమ్మ తల్లి ఆలయాన్ని గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఆలయాల నిర్మాణాలకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాందాస్, వెంకన్న, ఉల్లాస్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ అభిమానికి చేయూత

నార్నూర్: బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభిమాని చౌహాన్ విజయ్‌కుమార్‌ను ఆర్థికంగా ఆదుకునేందుకు సొంత ఖర్చులతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్ చేయూత అందించారు. ఉట్నూర్ ఎక్స్‌రోడ్ వద్ద టీషాష్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. విజయ్ ఆర్థిక పరిస్థితిని గమనించి వారి కుటుంబానికి అండగా నిలిచి మానవత దృక్పదంతో చేయూతనందించిన మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ జాదవ్ శ్రీరామ్‌నాయక్‌ను ఆమె అభినందించారు. మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, రూప్‌దేవ్, రాథోడ్ మధుకర్, మాడవి రూప్‌దేవ్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి

- పంట మార్పిడి చేస్తున్న గిరిజనులు
- గాదిగూడ, బేలలో అధిక సాగు
- అవగాహన కల్పిస్తున్న సీపీఎఫ్ సంస్థ


సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న మహిళా రైతులు


గాదిగూడలో సాగు చేస్తున్న పెసర పంట రైతు

నార్నూర్: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతతో పాటు రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో ఏజెన్సీలో గిరిజన రైతులు పంట సాగు చేస్తున్నారు. పంట మార్పిడి చేస్తూ అధిక లాభాలను పొందుతున్నారు. సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రత్యేక అవగాహన, శిక్షణ ఇచ్చి సేంద్రియ సాగుపై నమ్మకాన్ని కలిగిస్తున్నారు. గాదిగూడ మండలంలో 36, బేల మండలంలో 43 గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో రైతులు ముఖ్యంగా ఆహార పంటలు, పప్పుధాన్యాలు, జొన్న, టమాటతో పాటు ఆరు రకాల కూరగాయాలను సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందవచ్చని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 79 గ్రామాల్లో 8,000 ఎకరాల్లో రైతులు సేంద్రియ పద్ధతిలోనే వ్యవసాయం చేస్తున్నారు. రైతులకు సేంద్రియ సాగు, పంట మార్పిడిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పూర్తిగా అవగాహనతో పంటల సాగుపై దృష్టిపెట్టి వ్యవసాయంలో రాణిస్తున్నారు.

సేంద్రియ పద్ధతులు..

జీవామృతము: జీవామృతము ద్వారా పంటలను కాపాడుకోవటానికి ఎంతో ఉపయోగపడతాయి. వీటిని ఒక డ్రమ్ములో 200 లీటర్లు (సుమారుగా 15 బిందెలు) నీటిని తీసుకోవాలి. ఆవు పేడ 10 కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లు, పప్పు దినుసులు పిండి 2 కిలోలు, బెల్లం 2 కిలోలు, గట్టు, పుట్ట మట్టి గుప్పెడు తీసుకొని కలపాలి. ఒక ఎకరం పంటపై పిచికారీ చేసుకోవాలి.

నీమాస్త్రం: రసం పీల్చే పురుగులను నివారించేందుకు నీమాస్త్రం పంటపై ఉపయోగిస్తారు. నీరు 200 లీటర్లు, వేప ఆకులు, రెమ్మలు, చిగుర్లు 10 కిలోలు, ఆవుపేడ 2 కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లు పదార్థాలు కావాల్సి ఉంటుంది. 10 కిలోల వేపాకును మెత్తగా రుబ్బి 200 లీటర్ల నీటిలో (ప్లాస్టిక్ డ్రమ్, ఇనుప డ్రమ్, సిమెంట్ డ్రమ్, మట్టి డ్రమ్) కలపాలి. 48 గంటల వరకు మూసి ఉంచాలి. మరుసటి రోజు మూడుసార్లు కర్రతో కలిపాలి. తరువాత పలచని గడ్డతో వడగట్టాలి. నీమాస్త్రం తయారు అవుతుంది. ఇలా తయారైనా నీమాస్త్రం మూడు నెలల వరకు నిల్వ ఉంటుంది. పంటలపై పొద్దున, సాయంత్రం పిచికారీ చేయాలి. పంట విత్తిన 20 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు మూడుసార్లు పిచికారీ చేయాలి.

అగ్ని అస్త్రం: అగ్నిఅస్త్రంను ఆవు మూత్రం 10 లీటర్లు, పొగాకు ఆకులు 1 కిలోలు, వెల్లులి 1/2 కిలో, పచ్చిమిర్చి-1/2కిలోలు, మూడు కిలోలు వేపా ఆకుల పేస్ట్ తయారు చేయడానికి వాడుతారు. ఒక పాత్రలో ఆవు మూత్రం తీసుకోని ఇందులో విడివిడిగా దంచిన వేప ఆకులు పొగాకు వెల్లులి, పిచ్చిమిర్చి ముద్దలను బాగా కలపాలి. పాత్రపైన మూతపెట్టి 5 సార్లు పొంగు వచ్చే విధముగా ఉడికించాలి. రెండు రోజుల పాటు చల్లరానిచ్చి బట్టతో వడగట్టాలి. ఈ అగ్నిఅస్త్రాన్ని మూడు నెలల వరకు నిల్వ ఉంచి వాడుకోవచ్చు. ఈరకంగా సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు.

మంచి దిగుబడి వస్తోంది



సేంద్రియ పద్ధతిలో పంట సాగు చేస్తున్నా.. మంచి దిగుబడి వస్తోంది. రసాయన ఎరువులను అసలే వాడడం లేదు. ఐదు ఎకరాల్లో జొన్న సాగు చేస్తున్నా. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
– కొడప కన్ను, రైతు, గాదిగూడ

కూరగాయలు సాగు చేస్తున్న



సేంద్రియ పద్ధతి ద్వారా కూరగాయలు సాగు చేస్తున్నా. మంచి లాభం ఉంది. సీపీఎఫ్ సంస్థ సహకారంతో సాగు చేస్తున్నాం. సేంద్రియ పద్ధతి ద్వారా ఎరువులు, పిచికారీ మందులు స్వయంగా తయారు చేసుకుంటాం. ఎకరానికి మంచి దిగుబడి ఉంది.
– భీంబాయి, మహిళ రైతు

అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు మొత్తం 79 గ్రామాల్లో దాదాపు 8,000 ఎకరాల్లో సేంద్రియ పద్ధతి ద్వారా పంట సాగు చేస్తున్నారు.
– రాథోడ్ దిలీప్, సీపీఎఫ్ సంస్థ ప్రోగ్రాం అధికారి

అ'పూర్వ' సమ్మేళనం



ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1997– 2002 బ్యాచ్ చెందిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులు చదువులమ్మ ఒడికి చేరారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనాడు చదువు చెప్పిన గురువులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి


బెల్ట్ గ్రేడింగ్‌లో చిన్నారులు, శిక్షకులు

ఆదిలాబాద్: వేసవి సెలవుల్లో విద్యార్థులు మొబెల్ ఫోన్లకు అతుక్కుపోకుండా క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ జాబాడే రాష్ట్ర పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం సాహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. మొబైల్ ఫోన్లను అధికంగా వినియోగించడం వలన ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకునేలా తల్లిదండ్రులు సైతం చిన్నారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆటపాటల వలన వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించి జీవితంలో సైతం ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. పెటా సంఘం జిల్లా కార్యదర్శి సాయి, సాహా తైక్వాండో క్లబ్ నిర్వాహకుడు వీరేష్, జిల్లా తైక్వాండో ఆఫీస్ సెక్రటరీ శృతి, కోశాధికారి మాధవి, సీనియర్ బ్లాక్ బెల్ట్ రాథోడ్ వనిత, ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల వారీగా జొన్న కొనుగోళ్ల షెడ్యూల్

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోలు కేంద్రంలో జొన్న పంటను విక్రయించే రైతులు గ్రామాల వారీగా ఈనెల 21 నుంచి వచ్చే నెల 15వరకు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాంసి, భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాల వారీగా కేటాయించిన తేదీలలో పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకురావాలని ఏవో రవీందర్, సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామానికి ఒక రోజు చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం పంట కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామాల వారీగా కొనుగోలు వివరాలు..

తేదీ	తాంసిమండలం	భీంపూర్‌మండలం
ఏప్రిల్ 21న	కప్పర్ల	--------
22న	అంబుగాం,గిరిగాం	భీంపూర్,డబ్బకుచ్చి.
23న	తాంసి(బి)	గోన, కమాట్‌వాడ
24న	గోట్కూరి,సావర్గాం	పిప్పల్‌కోటి,తాంసి(కె)
25న	పొన్నారి	గొల్లఘాట్, గోముత్రి
28న	బండల్‌నాగాపూర్	నిపాని, వడూర్
29న	జామిడి	ధనోర, అందర్‌బంద్
30న	హస్నాపూర్	కరంజి(టి), గుబిడి
మే2న	పాలోది	అర్లి(టి), అంతర్గాం
03న	వడ్డాడి	వడ్‌గాం, బెల్సరీరాంపూర్
05న	కప్పర్ల, పాలోది	పిప్పల్‌కోటి, తాంసి(కె)
06న	తాంసి(బి)	నిపాని, వడ్‌గాం, గొల్లఘాట్
07న	అంబుగాం, గిరిగాం	అర్లి(టి), అంతర్గాం
08న	జామిడి	కరంజి, గోముత్రి, గుబిడి
09న	పొన్నారి	బెల్సరీరాంపూర్, భీంపూర్
12న	హస్నాపూర్, వడ్డాడి	అందర్‌బంద్, డబ్బకుచ్చి
13న	గోట్కూరి, నాగాపూర్	ధనోర, గోన
14న	సావర్గాం, తాంసి(బి)	వడూర్, కమట్‌వాడ

15న మండలంలోని అన్ని గ్రామాలు

జ్యోతిష్య శాస్త్రంలో వడూర్ వాసికి డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రావణ్ కుమార్‌జోషి

నేరడిగొండ: వడూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితుడు, వేద పండితుడు ఎల్కూచి శ్రావణ్ కుమార్ (రాజు పంతులు)కి జ్యోతిష్య శాస్త్రంలో ఆలస్య వివాహాలు, సంతానం అనే అంశంపై పరిశోధన చేసినందుకు శుక్రాచార్య వేదిక్ యూనివర్సిటీ కర్ణాటక వారు డాక్టరేట్‌తో పాటు, జ్యోతిష్య ఆచార్య, జ్యోతిష్య శిరోమణి బిరుదును ప్రదానం చేశారు. సింహాచలం వేదికగా ఈ బిరుదును ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని సింహాచలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. అంతకు ముందు ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో పాటు భగవంతుడి కృపతోనే ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. వడూర్ గ్రామస్తులతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన


కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. గత రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. మొదటిరోజు స్వామి వారికి అర్చన, జలాభిషేకం, రెండవ రోజు మహా హోమం, మూడో రోజు వేకువజామున బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోవిందమ్మ, బ్రహ్మంగారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సదానంద్, మాజీ ఎంపీటీసీ కొడాల మహేందర్, సంతోశ్, నారాయణ పాల్గొన్నారు.

దేవాపూర్‌లో జొన్న పంట దగ్ధం


కాలిపోయిన పంటను చూపుతున్న రైతు

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఎంబడి రఘు అనే రైతు పొలంలో నిప్పు అంటుకుని రెండు ఎకరాల్లో సాగు చేసిన జొన్న పంట దగ్ధమైంది. బాధిత రైతు మాట్లాడుతూ.. చేతికొచ్చిన జొన్న పంట ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో కాలి బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశాడు. జొన్న పంటతో పాటు డ్రిప్పు పైపులు, మోటారు పరికరాలు కాలిపోయాయని వాపోయాడు. దీంతో రూ. లక్ష 50 వేల వరకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందన్నారు